క్లుప్తంగా

పాఠశాలకు కుర్చీల బహూకరణ



పాలకోడేరు హైస్కూల్‌కు
కుర్చీలు బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

పాలకోడేరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అవసరమైన కుర్చీలను పూర్వ విద్యార్థులు 2010–11 పదవ తరగతి బ్యాచ్ పోతుల సత్య నాగ పద్మారావు, జల్లి అచ్యుత్ సమకూర్చారు. బుధవారం 50 నీల్‌కమల్ కుర్చీలను పాఠశాల హెచ్‌ఎంకు అందజేశారు. దాతలను హెచ్‌ఎం పి.మహేష్ బాబు, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ చెల్లింకి మస్తాన్ రావు అభినందించారు.

మావుళ్లమ్మకు స్వర్ణం సమర్పణ



మావుళ్లమ్మ అమ్మవారికి
బంగారం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయానికి పట్టణానికి చెందిన పి.సత్యవతి 20గ్రాముల బంగారం సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో ఆలయ అధికారులకు బంగారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీర్వాదం, శేషవస్త్రం అందజేసినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ బి.ఎం. నగేష్ తెలిపారు.

ప్రజాసమస్యలను పరిష్కరించే దిశగా ఉద్యమాలు

పోడూరు: ప్రజాసమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ఉద్యమాలు నిర్వహించడమే సీపీఎం లక్ష్యమని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పిల్లి ప్రసాద్ అన్నారు. జిన్నూరులో బుధవారం గ్రామ కార్యదర్శి కొప్పర్తి నర్సింహమూర్తి అధ్యక్షతన గ్రామక మిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రసాద్ మాట్లాడుతూ 2025 నూతన సంవత్సరంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ధరల అదుపుపై దృష్టిసారించాలన్నారు. సమావేశానికి ముందు సూర్యానగర్ కాలనీ వద్ద కామ్రేడ్ కొప్పర్తి సూర్యనారాయణ విగ్రహానికి పార్టీ సీనియర్ నాయకులు తాళాబత్తుల గాంధీ పూలమాల వేసి కార్యకర్తలతో కలిసి నివాళులర్పించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడంలో కామ్రేడ్ సూర్యనారాయణ ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కిలారి సాంబమూర్తి, చివటపు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పేరిచర్ల ఫౌండేషన్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో పేరిచర్ల ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పేరిచర్ల ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం మహిళలకు బెడ్‌షీట్స్, చీరలు, రగ్గులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు పేరిచర్ల మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు సేవలను మరింతగా విస్తృతం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏడు లక్షల గోవిందనామ జపం

పాలకొల్లు సెంట్రల్: ఉభయగోదావరి జిల్లాల గోవిందమాల కల్యాణ ఉత్సవ కమిటీ గురు గోవింద పీఠం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏడు లక్షల గోవింద నామ జపం చేశారు. బుధవారం నంబూరి భాగ్యలక్ష్మి, కొప్పినీడి కల్యాణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో గోవింద నామ జపం చేశారు. గోవిందమాల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కోసం స్థలం సేకరణ వేగంగా జరగాలని సంకల్పంతో ఈ జపం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గోవింద జపంలో సుమారు 100 మంది మహిళలు, గోవింద స్వాములు పాల్గొన్నారు.

క్షీరారామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



క్షీరారామలింగేశ్వరునికి పూజలు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నుండి భక్తులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు జనార్దనస్వామి, లక్ష్మీపార్వతి అమ్మవార్లకు అర్చనలు, కుంకుమ పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పారిశుద్ధ్యం ఇలా.. ప్రజారోగ్యం ఎలా?

- అపారిశుద్ధ్యంతో గ్రామాలు విలవిల
- నిరుపయోగంగా డంపింగ్ యార్డులు
- రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తున్న పంచాయతీలు



పెదపుల్లేరులో అధ్వానంగా ఉన్న డంపింగ్ యార్డు



వాండ్రంలో రోడ్డుపై డంప్ చేసిన చెత్త

ఉండి: పారిశుద్ధ్యంపై ప్రభుత్వం చేతులెత్తేసినట్టుంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. ప్రధాన రహదారుల గుండా చెత్తా చెదారంతో దుర్వాసన వెదజల్లుతుంది. వాహనదారులు, పరిసర గ్రామాల ప్రజలు దుర్గంధాన్ని భరించలేక నానా అవస్థలు పడుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడంతో అధికారుల్లో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. గ్రామాల్లో రెండు లేదా మూడు రోజులకో సారి అన్నట్లు చెత్త సేకరణ చేస్తున్నారు. సేకరించిన చెత్తను ఎక్కడబడితే అక్కడ వేస్తున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ప్రతీ సచివాలయ పరిధిలో నిర్మించిన డంపింగ్ యార్డులు అలంకార ప్రాయంగా మారిపోయాయి. డంపింగ్‌యార్డుల వద్ద రోడ్లపై చెత్త వేయడంతో అసలు డంపింగ్ యార్డులు దేని కోసం ఏర్పాటు చేసారో తెలియక ప్రజలు అయోమయంలో ఉన్నారు. కోట్లాది రూపాయల నిధులు కేటాయించి స్వచ్ఛతే లక్ష్యంగా చెత్త నుంచి సంపద సృష్టించే ఆదాయ వనరుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా నిర్మించిన చెత్త సేకరణ (ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు) కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు వేదికలుగా మారుతున్నాయి. ఊరికి చివర నిర్మించడంతో మందుబాబులకు అడ్డాగా మారాయి.

రంగులేసి వదిలేశారు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం కొంతమేర హడావుడి సృష్టించింది. ఆ వెంటనే పారిశుద్ధ్య పరిరక్షణ అంటూ మాట్లాడిన ప్రభుత్వ పెద్దలు, ప్రజా ప్రతినిధులు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లకు రంగులు వేయించారు. అనంతరం వాటి వైపు చూడటం మానేశారు. చెత్త సేకరణ, నిర్వహణకు అధికారులు తిలోదకాలిచ్చారు. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారిపోయింది.

మూగ జీవాలకు ప్రాణాపాయం

రోడ్లపై విచ్చలవిడిగా చెత్త వేయడంతో వాటిని తినేందుకు మూగ జీవాలు పోటీ పడుతున్నాయి. రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లోనూ డంప్ చేసిన చెత్తలోని పాలిథీన్ కవర్లు, హానికర వస్తువులను తిని మూగ జీవాలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాయి. జంతు ప్రేమికులు అధికారుల నిర్లక్ష్య వైఖరిపై మండిపడుతున్నారు.

భరించలేని దుర్వాసన



ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చెత్త నుంచి సంపద సృష్టి అనే కార్యక్రమం చాలా బాగుంది. కానీ ఇంత నిర్లక్ష్యంగా చెత్తను ఇష్టానుసారం పారవేయడం దారుణం. ఖాళీ స్థలం కనబడితే చాలు అన్నట్లు చెత్తను డంప్ చేస్తున్నారు. రోడ్లపై ప్రయాణించేటపుడు భరించలేని దుర్వాసన వస్తుంది.

– అంగర రాంబాబు, ఉండి

ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారు



డంపింగ్ యార్డులు సరైన విధంగా ఎక్కడా నిర్వహించడం లేదు. ఇప్పటికే పలు గ్రామాల్లో విపరీత జ్వరాలతో చాలామంది ఆసుపత్రుల పాలవుతున్నారు. ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెబుతున్నారు. కాని ప్రజారోగ్య పరిరక్షణను గాలికొదిలేశారు.

– శేషాద్రి శ్రీనివాస్, ఉండి

గతమెంతో వైభవం



చిత్తశుద్ధితో పనిచేసిన వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం గ్రామాలను సమూలంగా మార్చేసింది. ఎక్కడా చెత్త వేయనీయకుండా తడి, పొడి చెత్త సేకరణకు ప్లాస్టిక్ డబ్బాలను అందించింది. చెత్త సేకరణకు గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేసింది. ఇలా ఎక్కడా గ్రామాల్లో చెత్త కనబడకుండా డంపింగ్ యార్డులకు తరలించేవారు. కానీ ఇప్పుడు ఎక్కడ చూసినా చెత్తా, చెదారం. డంపింగ్ యార్డుల వద్ద కూడా సరైన నిర్వహణ లేదు.

– బూసి వాల్టర్‌లాల్, ఉండి

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి



కాళ్ల: నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేస్తున్న పీవీఎల్



ఆకివీడు: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పీవీఎల్ నర్సింహరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆకివీడు మండల నాయకులు



భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కార్యకర్తలు



భీమవరం(ప్రకాశం చౌక్): మాజీ డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు, అభిమానులు



ఆకివీడు: నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



ఆకివీడు: మాజీ కన్వీనర్ గోకరాజు రామరాజుకు నూతన సంవత్సర శుభాకాంక్షలుతెలుపుతున్న ఆకివీడు మండల నాయకులు

కాళ్ల: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే కూటమి ప్రభుత్వం అమలు చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నరసింహరాజు డిమాండ్ చేశారు. కాళ్ల మండలం పెదఅమిరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజవర్గంలోని పార్టీ నాయకులు ,కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొని పీవీఎల్ ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పీవీఎల్‌ను గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అమలు కాని హామీలు ఇచ్చి పేద ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఏర్పడి ఆరు నెలలు భయపడి కావస్తున్న ఒక హామీని కూడా నెరవేర్చదని విమర్శించారు. ఈ సంవత్సరం అయినా ఇచ్చిన హామీలు అమలు చేసి పేద ప్రజల పండగ నిలవాలని కోరారు. కార్యక్రమంలో కాళ్ళ, ఆకివీడు, ఉండి, పాలకోడేరు మండలాల నాయకులు కార్యకర్తలు అభిమానులు, మండల కన్వీనర్లు, పెనుమత్స ఆంజనేయరాజు, గణేశ్న రాంబాబు,వేగేశ్న జయ రామ కృష్ణంరాజు, సాగిరాజు హరివర్మ, మంతెన సునీల్ వర్మ, గుండు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. బుధవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పీవీఎల్ నర్సింహరాజును ఆకివీడు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైస్‌చైర్మన్ పుప్పాల పండు ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. మాజీ కన్వీనర్ గోకరాజు రామరాజును పలువురు మండల నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చారు. స్థానిక నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతిని కమిషనర్ జి.కృష్ణమోహన్, కౌన్సిలర్లు, సిబ్బంది, మండల, సచివాలయ అధికారులు, సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖులను కలిసిన వారిలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), ఏఎంసీ మాజీ చైర్మన్లు మోటుపల్లి గంగాధరరావు, ఎండీ.మస్తాన్‌వలీ, ఎస్కే.రసూల్‌బీబీ హుస్సేన్, వైసీపీ పట్టణ అధ్యక్షులు అంబటి రమేష్, నగర పంచాయతీ వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, జి.ధనరాజు, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, మంతెన సునీల్ వర్మ, కఠారి రామకృష్ణ, ఎరిచర్ల గ్లాడ్సన్ తదితరులు ఉన్నారు.

కోటి ఆశలతో నవ వసంతంలోకి..

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులను ఆయా శాఖల సిబ్బంది కలుసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వేండ్ర వెంకటస్వామిని ఆయన నివాసంలో నాయకులు కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు

భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు నియోజకవర్గంలోని పలు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

గూడూరి ఉమాబాలకు

వైఎస్సార్ సీపీ నర్సాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

వీరవాసరంలో..

వీరవాసరం: వీరవాసరం మండల వ్యాప్తంగా బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచులు, ఎంపీటీసీలు ప్రజా ప్రతినిధుల ఇళ్ల వద్ద కేకులను కట్ చేసి పంపిణీ చేశారు. నూతన సంవత్సరంలో అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కలగాలని ఆకాంక్షించారు

7న ఆకివీడులో డయాలసిస్ కేంద్రం ప్రారంభం

ఆకివీడు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 7న డయాలసిస్ కేంద్రాలన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామానికి చెందిన డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు వారి కుమారుడు స్వర్గీయ విశ్వనాథరాజు, కోడలు స్వర్గీయ పద్మ సుందరిల జ్ఞాపకార్థం రూ. 65 లక్షల వ్యయంతో డయాలసిస్ కేంద్రాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొల్పారు. ఒకేసారి నలుగురు కిడ్నీ రోగులకు ఉచిత డయాలసిస్ చేసే అవకాశం ఉన్న యంత్రాలను ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. ఇప్పటివరకూ జిల్లాలో తణుకు ఏరియా ఆసుపత్రిలో ఈ సౌకర్యం ఉంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు చేసిన కృషి ఫలించింది. చెరుకుమిల్లిలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ, వైద్య సేవలందిస్తూ, గ్రామాభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న డాక్టర్ సత్యనారాయణరాజు అత్యంత ప్రజా ఉపయోగకరమైన ఉచిత డైయాలసిస్ కేంద్రాన్ని ఆకివీడులో ఏర్పాటు చేసేందుకు భూరి విరాళం అందజేసి ముందుకు వచ్చినందుకు పలువురు అభినందిస్తున్నట్లు ఆయన సోదరుడు, చెరుకుమిల్లి సొసైటీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు దాట్ల బోసురాజు చెప్పారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబును
గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని బ్యాంకు కాలనీలోని కాపు కల్యాణ మండపం వద్ద ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. అంజిబాబుకు వివిధ రాజకీయపార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధశాఖల అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయం వద్ద నూతనసంవత్సర వేడుకల సందడి నెలకొంది. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయపార్టీల నాయకుల, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

యువత క్రీడల్లో ప్రతిభ చాటాలి



జిన్నూరులో వాలీబాల్ క్రీడాకారుడు గుబ్బల
శ్రీనివాస్(చోటు)ను సత్కరిస్తున్న స్థానిక నాయకులు

పోడూరు: యువత క్రీడల్లో ప్రతిభను పెంపొందించుకుని రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాద్ దేవళ్ల ప్రసాద్ పిలుపునిచ్చారు. జాతీయ వాలీబాల్ జట్టు(సీనియర్స్)కు ఎంపికైన సందర్భంగా జిన్నూరు గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారుడు గుబ్బల శ్రీనివాస్(చోటు) ను స్థానిక నాయకులు బుధవారం సత్కరించారు. దేవళ్ల ప్రసాద్, మాజీ సర్పంచ్ పాలవలస తులసీరావు దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. శ్రీనివాస్ గత కొన్నేళ్లుగా వాలీబాల్ క్రీడాకారుడిగా సత్తా చాటుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం గ్రామానికి ఎంతో గర్వకారణమని వారు కొనియాడారు. కార్యక్రమంలో వార్డుమెంబరు గూడూరి తారకరామారావు, గ్రామపెద్దలు పితాని శ్రీనివాస్, చెల్లబోయిన వెంకట్రావు, పాటి వెంకటేశ్వరరావు, పాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ మేషక్ సతీష్‌కుమార్

ఉండి: మండల వ్యాప్తంగా న్యూఇయర్ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్యంగా చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం, వాండ్రంలంక, వాండ్రం, చిలుకూరు, వెలివర్రు, మహదేవపట్నం, చెరుకువాడ, ఉండి, యండగండి, తదితర గ్రామాల్లోని పలు ప్రాంతాల్లోని చర్చిల్లో, ప్రధాన సెంటర్లలోను ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నార్పీ అగ్రహారంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలు అద్యంతం ఆకట్టుకున్నాయి. పేరిష్ పాస్టర్లు రైట్ రెవరెండ్ మేషక్ సతీష్‌కుమార్, అబ్షాలోమ్‌రాజు, సీఆర్ పి.కరుణాకర్‌రావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు గుమ్మడి అమృతరావు, చుక్కా శేఖర్, ముత్యం కుమార్, పేరిష్ డెలిగేట్ బెంజిమెన్ పాల్గొన్నారు.



ఉండిలో కొవ్వొత్తుల వెలుగులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

మావుళ్లమ్మ సేవలో కలెక్టర్ నాగరాణి



మావుళ్లమ్మను దర్శించుకుంటున్న
కలెక్టరు చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని స్థానిక మావుళ్లమ్మ అమ్మవారిని బుధవారం కుటుంబ సభ్యులతో జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి దర్శించుకున్నారు. వేద పండితులు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హారతులు అందజేశారు. అనంతరం ఆశీర్వాచన మండపం నందు జిల్లా కలెక్టరు, కుటుంబ సభ్యులకు అమ్మవారి శేషవస్త్రాన్ని అందజేసి, వేద పండితుల ఆశీర్వచనాలను అందజేశారు. ప్రసాదాలను, అమ్మవారి చిత్రపటాన్ని ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ జిల్లా కలెక్టరుకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలందరూ సుఖ, సంతోషాలతో ఉండాలని, రైతులంతా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, విద్యార్థులు పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని అమ్మవారిని కోరుకున్నట్లు కలెక్టరు చదలవాడ నాగరాణి తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ డీఈవో సుబ్బారావు, ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ, ఆలయ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలు దారుణం



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి
నివాళులర్పిస్తున్న మున్వర్ తదితరులు

భీమవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీవీ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కన్వీనర్ ఎండీ మున్వర్ అన్నారు. బుధవారం భీమవరంలో పార్టీ తాత్కాలిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్వర్ మాట్లాడుతూ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం కేంద్రమంత్రికి తగదని హితవు చెప్పారు. రాజ్యాంగాన్ని గౌరవించని హోం మంత్రి అమిత్‌షా ప్రజలను, చట్టాలను ఎలా గౌరవిస్తారని మున్వసర్ ప్రశ్నించారు. ఖలీల్ అహ్మద్, తాహిర్, సాధిక్, మగ్బూల్, శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావ సభకు మద్దతుగా బైక్ ర్యాలీ

పెనుమంట్ర: హిందూ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావ సభకు మద్దతుగా మండల విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం బైక్ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మండలంలోని సోమరాజు ఇల్లిందలపర్రు నుంచి ఉదయం ప్రారంభించి జుత్తిగ, మాముదూరు, పెనుమంట్ర, వెలగలవారి పాలెం, ఆలమూరు, నెలమూరు, సచివరం, వెలగలేరు గ్రామాల మీదుగా ప్రచారం చేస్తూ మార్టేరు గ్రామానికి చేరుకుంది. ఈ ప్రచార ర్యాలీలో వివిధ పార్టీలకు చెందిన యువత పాల్గొన్నారు.